క్లుప్తంగా

వెండి కిరీటం బహూకరణ



తొస్సిపూడిలో ఆలయ అర్చకులకు వెండి కిరీటం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ తల్లి ఆలయానికి కాకినాడకు చెందిన ఆకెళ్ల శ్రీరామ ఫణికుమార్, సుజాత దంపతులు రూ.20 వేలు విలువ గల వెండి కిరీటం బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు కామేష్ శర్మ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తేతలి జగ్గిరెడ్డి, గొలుగూరి భారతి, తేతలి సుబ్బారెడ్డి, కొవ్వూరి సుబ్బారెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, ఆకెళ్ల వంశీ నిశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతో గుర్తింపు



సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరిని అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదపూడి: విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించే ప్రతిఒక్కరికీ మంచి గుర్తింపు లభిస్తుందని ఇన్చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి నుంచి బదిలీపై పెద్దాడ, పైన గ్రామ సచివాలయాలకు కార్యదర్శులుగా వెళుతున్న మన్యం శ్రీనివాసుచౌదరి, సుబ్రహ్మణ్యంకు సత్కార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరికీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ శ్రీనివాస్, కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్ కె.కృష్ణమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పుట్టా గంగాధర్‌చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, వల్లూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

జువాలజీలో ప్రసాద్‌కు పీహెచ్‌డీ



ప్రసాద్‌కు పీహెచ్‌డీ అందజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ జువాలజీ విభాగం నుంచి పీఆర్‌జీఎస్ ప్రసాద్ పీహెచ్‌డీ సాధించారు. ఆయనకు ఇన్‌చార్జి వీసా ఆచార్య వై.శ్రీనివాసరావు పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. 'అసిటోసా సాగిట్టాటా (పాలిగోనేసి కుటుంబం) నుంచి ఉద్భవించిన కార్బన్ చుక్కల ఇన్ విట్రో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ డయాబెటిక్ ప్రాపర్టీస్ అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది.

కబడ్డీ పోటీలలో సత్తా చాటిన బాలికలు



దివాన్‌చెరువులో జరుగుతున్న వాలీబాల్ పోటీలు

రాజానగరం: అనకాపల్లిలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ 7 బాలికల కబడ్డీ పోటీలలో దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ టీమ్ సత్తా చాటింది. అండర్ 14, 19 విభాగాలలో విజేతలుగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నుంచి బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపాల్ విమల తెలిపారు. విజేతలను, కోచ్‌ను ఆమె అభినందించారు.

నేడు వాలీబాల్ పోటీల ముగింపు

దివాన్ చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ 7 వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. చివరి రోజు ఫైనల్స్ జరుగుతాయి.

ఎన్ఈఎస్ఎస్‌సీఓ ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెదపూడి: గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తున్న నియో విద్య, క్రీడ, సాంస్కృతిక నైపుణ్యాభివృద్ధి స్వచ్ఛంద సేవా సంస్థ(ఎన్ఈఎస్ఎస్‌సీఓ) సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం పెడపర్తి గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 3కే రన్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రహదారుణం

- అధ్వానంగా రాజానగరం రోడ్డు
- పూడుకుపోయిన కల్వర్టులు
- రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం

రాజానగరం: సాధారణంగా నియోజకవర్గం కేంద్రంలోని రహదారులు చాలా బాగుంటాయి. రాకపోకలకు ఎంతో అనువుగా తీర్చదిద్దితారు. రోడ్లతో పాటు మురుగునీటి కాలువలు కూడా అభివృద్ధి చెంది ఉంటాయి. అలాగే ఆ ప్రాంతం పరిశుభ్రంగా, చక్కగా ఉంటుంది. కానీ రాజానగరంలో మాత్రం పైనే చెప్పుకున్న అంశాలేమీ మచ్చుకైనా కనిపించవు. నియోజకవర్గ కేంద్రమైన ఈ గ్రామంలో రోడ్డు అధ్వానంగా మారింది. రాజానగరంలోని పూర్వపు జాతీయ రహదారిగా ఉన్న రోడ్డు నేడు గోతులమయమైంది. గుంతలు పడి రాకపోకలకు ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి సినిమా హాలు వరకూ, మసీదు నుంచి నూకాలమ్మ గుడి వరకూ ఇదే విధంగా ఉంది. దీనికి తోడు వర్షాలు కురిస్తే ఇక ఆ ప్రాంతమంతా చెరువును తలపిస్తోంది.

పూడుకుపోయిన కల్వర్టులు

గ్రామంలో ప్రధాన రహదారి ఈ విధంగా ఉండటానికి ప్రధాన కారణం ముంపు నీరు దిగువకు పోయేందుకు రోడ్డు కింద తూరలతో ఏర్పాటు చేసిన కల్వర్టులు కూరుకుపోవడమే. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం గ్రామంలోని పాత ఎన్‌హెచ్‌పై టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సినిమా థియేటర్, జెడ్పీ బంగ్లా, మసీదు ప్రాంతాలలో పూర్వం తూరలతో వేసిన కల్వర్టులు పూడుకుపోయాయి. వీటితో పాటు నూకాలమ్మ గుడి వద్ద వేసిన తూరలను తొలగించి, కొత్త కల్వర్టును గత ఏడాది నిర్మించారు. ఆ సమయంలోనే సినిమా థియేటర్ వద్ద కూడా కల్వర్టు నిర్మించే ప్రయత్నం చేశారు, కానీ ఎగువ ప్రాంతంలో ముంపు ఏరియాలో ఓ బడా వ్యక్తి వేసిన లే అవుట్ కోసం కొత్తగా కల్వర్టును నిర్మించారు. అది ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. దిగువన ఈ ప్రాంతాలు మాత్రం ముంపు బారిన పడుతున్నాయి. ఆయా ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారు వాడే మురుగు నీరు కూడా రోడ్డు పైనే పారుతుంది.



టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద పూడుకుపోయిన కల్వర్టు



రాజానగరం సినిమా థియేటర్ వద్ద పాత జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

చర్యలు తీసుకోవాలి

గ్రామంలోని పాత జాతీయ రహదారిపై పూర్వం తూరలతో వేసిన కల్వర్టులు ఎక్కడెక్కడ పూడుకుపోయాయో తెలుసుకోవాలి. వాటిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం మురుగుకాలువల్లోని నీరు రోడ్డుపైకి చేరుతుంది. దాని మీదుగా పల్లపు ప్రాంతానికి ప్రవహిస్తోంది. మురుగు నీటి ప్రవాహం కారణంగా రోడ్డు పాడైపోతోంది. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

కొత్తగా కల్వర్టులు నిర్మించాలి



సూర్యారావుపేట వద్ద వేసిన లే అవుట్ కోసం ఆ ప్రాంతంలో లేని కల్వర్టును నిర్మించారు. పూడుకుపోయిన కల్వర్టును అలాగే గాలికి వదిలేశారు. ఇకనైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించాలి. పాత ఎన్‌హెచ్ రోడ్డు పాడైన చోట అందుకుగల కారణాలను పరిశీలించాలి. పూడుకుపోయిన కల్వర్టుల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలి. –సుంకర వెంకట్రావు, వెంకన్నపేట

మరమ్మతులు చేసిన ఏడాదికే..



రాజానగరంలో పాత జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ఏడాది కూడా కాలేదు. అప్పుడే ఎక్కడ గోతులు అన్నట్టు మారింది. సినిమా థియేటర్ వద్ద రాకపోకలు సాగించేందుకు కూడా వీలులేనంతగా రోడ్డు దెబ్బతింది. కల్వర్టులు మూసుకుపోయి దశాబ్దాలు కాలమైంది.

– సత్తి త్రిమూర్తులు, శ్రీరామనగర్

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

- కలెక్టర్ ప్రశాంతి
- కోరుకొండ తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధత, జవాబుదారీతనం కలిగి ఉండాలని, విధులకు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. ఆమె శనివారం కోరుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉద్యోగుల వివరాలు, హాజరు పట్టీ ప్రకారం సిబ్బందిని పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ ఏ.రజనీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో విధుల్లో ఉండాల్సిన సిబ్బంది కార్యాలయంలో ఎందుకులేరని అడిగారు. హాజరుపట్టీని తనవెంట తీసుకెళ్లి, సంబంధిత సిబ్బంది కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. సిబ్బంది నుంచి తగిన వివరణ తీసుకుని నివేదికను అందజేయాలని తహసీల్దార్ సుస్వాగతానికి ఫోన్‌లో ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అండ్ జువాలజీ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి ఉన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం



రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రంగంపేట: రాజకీయ వివక్ష లేకుండా అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, పశు వైద్యం, ఐసీడీఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ శాఖల ఉన్నతిని సభకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించి అభివృద్ధి దిశగా తీసుకెళతామన్నారు. పెదరాయవరం-సింగంపల్లి, రంగంపేట-జి.దొంతమూరు రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, డిప్యూటీ తహసీల్దార్ యు. రంజిత్‌కుమార్, ఎంపీడీఓ పి.వెంకటరత్నం, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను పాల్గొన్నారు.

కిసాన్ నిధుల విడుదలను వీక్షించిన రైతులు



కలవచర్ల కేవీకేలో పీఎం కిసాన్ నిధుల విడుదలను వీక్షిస్తున్న రైతులు

రాజానగరం: కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని జిల్లాకు చెందిన 80 రైతులు వెబ్ క్యాస్ట్ ద్వారా శనివారం వీక్షించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశంలోని 9.4 కోట్ల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనాన్ని కల్పిస్తూ 18వ విడతగా రూ. 20 వేల కోట్లను విడుదల చేశారు. మహారాష్ట్రలోని వాషిమ్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేవీకేలో నిర్వహించిన వెబ్ క్యాస్ట్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, మండల వ్యవసాయాధికారి ఖాసిం, కేవీకే అధికారులు డాక్టర్ వీఎస్ జీఆర్ నాయుడు, సత్యవాణి, డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, సంజయ్ వినాయక్ హెగ్డే, రఘునందన్ పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

రాజానగరం: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా జేఏ ఝాన్సీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె బిక్కవోలు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జిగా ఉన్న సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

కోరుకొండ ఎంపీడీఓగా అశోక్

మధురపూడి: కోరుకొండ ఎంపీడీఓగా బత్తిన అశోక్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెద్దాపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ముందుగా ఆయనకు కార్యాలయం ఉద్యోగులు సాదర స్వాగతం పలికారు. శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఎంఈఓ కుశలవదొర, ఎంపీడీఓ కార్యాలయంలో విశ్రాంత ఏవో కృష్ణమూర్తి, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకూ ఎంపీడీవోగా పనిచేసిన పీఎస్ నరేష్ కుమార్ కొత్తపేటకు బదిలీ అయ్యారు.

సీతానగరం మండలానికి భారతి

సీతానగరం: ఎంపీడీవోగా ఎం.భారతి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె జి.గన్నవరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమెకు ఈవోపీఆర్డీ మూర్తి, ఏవో గోపాల్, ఏపీవో నాగేశ్వేణి, సీనియర్ అసిస్టెంట్లు శివగోపాల్, విజయ్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సుమతి, ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు చక్రవర్తి, వీరబాబు, సీవో మొహిద్దీన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. మొక్కలను అందించి అభినందనలు తెలిపారు. కాగా.. ఇప్పటి వరకూ పనిచేసిన ఎంపీడీవో కె.రమేష్ కడియం మండలానికి బదిలీ అయ్యారు.

రంగంపేటకు సాయిబాబు

రంగంపేట: మండల ఎంపీడీఓగా వీవీ సాయిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ రావులపాలెం ఎంపీడీఓగా పనిచేస్తూ బదలీపై రంగంపేట వచ్చారు. కాగా రంగంపేట ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన పి.వెంకటరత్నం ఇకపై ఈఓపీఆర్డీగా కొనసాగనున్నారు. బాధ్యతలు స్వీకరించిన సాయిబాబును ఈఓపీఆర్డీ వెంకటరత్నం, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.



రాజానగరంలో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఝాన్సీ



కోరుకొండలో ఎంపీడీఓ అశోక్ కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు



సీతానగరంలో ఎంపీడీవో భారతికి స్వాగతం పలుకుతున్న ఈవోపీఆర్డీ మూర్తి తదితరులు



రంగంపేట ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సాయిబాబుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

జక్కంపూడి రాజా హయాంలో ప్రగతి పరుగులు

- నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- కొనియాడిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

సీతానగరం: రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఎంతో కృషి చేశారని పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ కొనియాడారు. జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలను శనివారం సీతానగరంలోని శ్రీనివాస్ నివాసంలో ఘనంగా జరిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే మాజీ చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, సీనియర్ నాయకుడు చిర్రవూరి మధుసూదనరావు తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని జక్కంపూడి రాజా అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కాతేరు – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సీతానగరం పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆసుపత్రిగా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఎన్నడూ లేని విధంగా తుపాను వర్షాలకు తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు మట్ట వసంతరావు, వలవల సత్తిబాబు, పోలినాటి ఈశ్వరుడు, గద్దె వీరన్నబాబు, ముదునూరి రామకృష్ణంరాజు, తొరం బ్రహ్మాజీ, చిర్ల పోశియ్య, మురార్జీ, గోపిశెట్టి అచ్చారావు పాల్గొన్నారు.

- కాటవరంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టిన రోజు వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, నాగంపల్లి, ముగ్గళ్ల, కూనవరం, ఇనుగంటివారిపేట, రాజంపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, మిర్తిపాడు, ములకల్లంక, ఉండేశ్వరపురం గ్రామాల్లో వేడుకలు జరిగాయి.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న సభ్యులు



సీతానగరంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

ప్రజలకు అండగా జక్కంపూడి రాజా

మధురపూడి: కష్టాల్లో ఉన్న ప్రజలకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎల్లప్పుడూ అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో పార్టీ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాజా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆరీఫ్ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం ప్రజలకు ఎనలేని సేవలందించిన ఘనత జక్కంపూడి కుటుంబానికి దక్కుతుందన్నారు. వినయ్ తేజ మాట్లాడుతూ కరోనా సందర్భంలో ప్రజల క్షేమం కోసం ఎంతగానో తపించారన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో క్యాన్సర్ నివారణ కోసం కృషి చేశారన్నారు. ఆ కుటుంబంలోని సభ్యులందరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. పిట్టా కృష్ణ, తోరాట శ్రీను, సూరిశెట్టి కుటుంబరావు, బొరుసు బద్రి, చాటపర్తి దుర్గారావు, యడ్ల గంగా సురేష్, బొండాడ చందు పాల్గొన్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో జక్కంపూడి రాజా పుట్టినరోజు వేడుకలు జరిగాయి.



కాటవరంలో వేడుకలు నిర్వహిస్తున్న శ్రీహరిబాబు తదితరులు



బూరుగుపూడిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

వృద్ధులకు అన్నదానం

రాజానగరం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టిన రోజును పురస్కరించుకుని కొండగుంటూరు పాకలులోని లక్ష్మీకృష్ణ బృందావనం వృద్ధుల ఆశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి అబ్బిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దూలం నాని, అద్దంకి రమణ, అల్లంపల్లి కిశోర్, తుపాకుల ప్రసన్నకుమార్, బండెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే

పెదపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం కనకదుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని జి.మామిడాడ, పెదపూడి, సంపర, రామేశ్వరం, పెద్దాడ, కాండ్రేగుల గ్రామాల్లో దుర్గాదేవి మంటపాల వద్ద పెద్ద ఎత్తున భక్తులు ఉదయం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

రంగంపేట: స్థానిక దేవీ సెంటర్‌లోని ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారు. చంద్రేడులో కాత్యాయనీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో మూడో రోజు అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. దొంతమూరు మెయిన్‌రోడ్డులోని విజయదుర్గాదేవి 6వ నవరాత్ర మహోత్సవాలను మూడో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈలకొలనులో ముత్యాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గాదేవి



సంపరలో అన్నపూర్ణ దేవి అవతారంలో విజయదుర్గమ్మ

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ, పందలపాక శ్రీదేవి అమ్మవారు, రాజరాజేశ్వరీ అమ్మవారు, బిక్కవోలు పార్వతి దేవి, ఊలపల్లి కనకదుర్గమ్మ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కొంకుదురులో కాటన్ దొర విగ్రహం వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద భవానీలు అగ్ని గుండాన్ని తొక్కారు. అనంతరం భవానీలంతా అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.



చంద్రేడులో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



వడిశలేరులో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కొమరిపాలెంలో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ తల్లి



కొంకుదురులో నిప్పులగుండం తొక్కుతున్న భవానీలు